సాక్షి
మంచిర్యాల

శుక్రవారం ׀ 22 ׀ నవంబర్ ׀ 2024



విధుల్లో క్రమశిక్షణ ముఖ్యం

పోలీసు విధుల్లో క్రమశిక్షణ ముఖ్యమని ఐజీ ఎం.రమేశ్ అన్నారు. గురువారం ఆదిలాబాద్‌లోని పోలీసు శిక్షణ కేంద్రంలో కానిస్టేబుళ్లకు దీక్షాంత్ పరేడ్ నిర్వహించారు. 8లో▸



బొగ్గు బంధం ముగిసినట్లే!

రామకృష్ణాపూర్‌లోని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు జనవరిలో కాలగర్భంలో కలిసిపోనుంది. దీంతో ఈ ప్రాంతానికి బొగ్గుపెళ్లతో ఉన్న బంధం తెగదెంపులు అయినట్లే. 9లో▸

గరిష్టం/కనిష్టం
28.0 /15.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. చలి తీవ్రత మరింతగా పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలి



ఓసీపీని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

శ్రీరాంపూర్: నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని సింగరేణి డైరెక్టర్(పా, పీపీ) జీ.వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన శ్రీరాంపూర్ ఓపెన్ కాస్టు గనిని సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ఓసీపీ రోజువారీ ఉత్పత్తి లక్ష్యం 12వేల టన్నులు సాధించాలని సూచించారు. ఓబీ లక్ష్యాన్ని కూడా అధిగమించాలని, ఉత్పత్తి అయిన బొగ్గును జాప్యం చేయకుండా వెంటనే రవాణా చేయాలని తెలిపారు. బొగ్గు ఉత్పత్తిలో రక్షణ నియమాలు పాటించాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి కంపెనీకి శ్రేయస్కరమని అన్నారు. అనంతరం క్వారీలోకి వెళ్లి బొగ్గు ఉత్పత్తి, కోల్ బెంచీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం టీ.శ్రీనివాస్, ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలి



మోదీకి లేఖ పంపిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: ఈ నెల 25నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని, 50శాతం రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించి ప్రధానమంత్రి మోదీకి లేఖ పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు రావాల్సిన వాటా రాకుండా ఎన్నాళ్లు దాట వేస్తారని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రిజర్వేషన్ల అమలుకు అనుకూలంగా రాజకీయ పార్టీలు తీర్మానాలు చేసి పంపించినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ సమావేశంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు కర్రె లచ్చన్న, రాష్ట్ర కార్యదర్శి అక్కల రమేష్, నాయకులు భీంసేన్, ఆరెందుల రాజేశం, అంకం సతీష్, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా జోనల్‌స్థాయి బాక్సింగ్ పోటీలు



పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక రాజీవ్‌నగర్ ఆదర్శ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జోనల్ స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అండర్–14, 17 బాలబాలికల బాక్సింగ్ పోటీలను ప్రిన్సిపాల్ బుచ్చన్న ప్రారంభించారు. 40 మ్యాచ్‌లగాను ఉమ్మడి జిల్లా నుంచి 102 మంది క్రీడాకారులు హాజరయ్యారు. బరువు కేటగిరీల వారీగా 16 మందిని ఎంపిక చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ ఫణిరాజా, అండర్–19 ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ బాబురావు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సుదీప్, మాజీ ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ రాజయ్య, ఉమ్మడి జిల్లాకు చెందిన కోచ్‌లు స్వామి, శ్రీసాయి, శేఖర్, రాజేశ్, ఆదిలాబాద్ జిల్లా బాక్సింగ్ జాయింట్ సెక్రెటరీ దేవేందర్ పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: నేతకాని కార్పొరేషన్ నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని నేతకాని మహార్ సంఘం నాయకులు మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. గురువారం మంచిర్యాలలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భూమి పూజకు హాజరైన ఆయనకు వినతిపత్రం అందజేశారు. నేతకాని మహార్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ మాట్లాడుతూ తమ కులం పేరు నేతనిని నేతకానిగా మార్పు చేయించినందుకు మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతకాని మహార్ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహా, వేదికపై మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ కుమార్ దీపక్, నాయకులు

వైద్యానికి భరోసా





శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రులు రాజనర్సింహా, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే పీఎస్సార్, ఎండీ హేమంత్ బోర్కడే, హాజరైన ప్రజలు

- సేవల పెంపునకు మంత్రి దామోదర రాజనర్సింహా హామీ
- సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి భూమి పూజ
- హాజరైన మంత్రి 'దుద్దిళ్ల', నాయకులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాలలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులకు భూమి పూజతో మెరుగైన వైద్య సేవలపై ఇక్కడి ప్రజల్లో ఆశలు నెలకొన్నాయి. త్వరితగతిన పూర్తి చేస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా హామీనివ్వడంతో వైద్యానికి భరోసా కలుగుతోంది. గురువారం మంత్రి దామోదర రాజనర్సింహా ముఖ్య అతిథిగా, ఐటీ పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో జరిగిన భూమి పూజ కార్యక్రమంతో జిల్లా వైద్య చరిత్రలో కీలక ముందడుగు పడింది. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ సర్కార్ వైద్యం అందక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. భూమి పూజ అనంతరం మంచిర్యాల ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో మంత్రులు మాట్లాడారు. వైద్యారోగ్య సేవలు మెరుగుపర్చేందుకు పలు హామీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్ బోర్కడే, కలెక్టర్ కుమార్ దీపక్, సీపీ శ్రీనివాసులు, కనీస వేతన బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, జిల్లా వైద్యాధికారి హరీశ్ రాజ్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సులేమాన్, మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ తదితరులు పాల్గొన్నారు. మంత్రుల పర్యటన సందర్భంగా పట్టణంలో ఏసీపీ ప్రకాశ్, సీఐ ప్రమోద్‌రావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంత్రుల రాక కాస్త ఆలస్యం అయినప్పటికీ నాయకులు, కార్యకర్తలు ఓపికగా ఉన్నారు. మరోవైపు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీక్రిష్ణకు ఈ కార్యక్రమానికి ఆహ్వానం పంపలేదని ఆయన అనచరులు సోషల్ మీడియా వేదికగా అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

> **నాణ్యమైన విద్య, వైద్యం**
>
> దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే నాణ్యమైన విద్య, వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. ఈ ఆసుపత్రి నిర్మాణంతో జిల్లాతోపాటు పొరుగు రాష్ట్రాల ప్రజలకు ఉపయోగమని, 15లక్షల మందికి ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. రూ.300కోట్లతో మాతాశిశు, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మిస్తున్నామని వివరించారు.

90శాతం వైద్యం ఇక్కడే..

హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లకుండా జిల్లా పరిధిలోనే 90శాతం వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి దామోదర రాజనర్సింహా హామీ ఇచ్చారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు మంచి ఆలోచన అని, భూమి పూజ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. జిల్లాలో అంబులెన్స్‌ల సంఖ్య పెంచడం, ఆశల నియామకం, పీహెచ్‌సీల అప్‌గ్రేడ్, సబ్‌సెంటర్ల ఏర్పాటు, వైద్య సిబ్బంది నియామకం, ట్రామాకేర్ సెంటర్, క్యాన్సర్ సెంటర్, డయాలసిస్ పడకల సామర్థ్యం పెంపునకు కృషి చేస్తానని తెలిపారు. దండేపల్లి మండలం వెంకట్రావ్‌పేట, చెన్నూరు మండలం అంగ్రాజ్‌పల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుపై పొగడ్తల వర్షం కురిపించారు. మొండిగా పట్టుబట్టి ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్నారని ప్రశంసించారు.

అకుంఠిత దీక్షతో ఆసుపత్రి నిర్మాణం

ఆస్పత్రి నిర్మాణం అకుంఠిత దీక్షతో పూర్తి చేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. ఆస్పత్రి ఏడు నియోజకవర్గాలు, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ప్రజలకు భారం కాకుండా ఉచితంగా వైద్యం అందుతుందని చెప్పారు. ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. వరదలకు గురికాకుండా రూ.263కోట్లతో కరకట్ట, రూ.40కోట్లతో ప్రభుత్వ పాఠశాలలు, జిల్లాలో ఇండస్ట్రీయల్ పార్కు, ఎస్టేట్ ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు. చిన్న, మధ్యతరగతి పరిశ్రమల అభివృద్ధి, దండేపల్లిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్, జిల్లా కేంద్రంలోనే డ్రగ్ స్టోర్ ఏర్పాటు చేశామని తెలిపారు.

> **మంత్రి 'దామోదర' హామీలు**
>
> - డయాలసిస్ కేంద్రం 30పడకలకు పెంపు
> - డయాబెటిక్ వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలు
> - కొత్తగా 29హెల్త్ సబ్‌సెంటర్ల ఏర్పాటు
> - వెంకట్రావుపేట, అంగ్రాజ్‌రాజ్‌పల్లిలో 24గంటల పీహెచ్‌సీల ఏర్పాటు
> - మంచిర్యాల పట్టణంలో 30మంది 'ఆశ'ల నియామకం
> - క్యాన్సర్, వస్కులర్ సెంటర్, వైద్య సిబ్బంది పెంపు

'గ్యారంటీలు అమలు చేయాలి'



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: ప్రభుత్వం ప్రకటించిన గ్యారంటీలు అమలు చేయాలని ధర్మసమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 90 శాతం పేద, మధ్య తరగతి వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీలు ఉన్నారని, విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇళ్ల సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ నాయకులు జంగపెల్లి రామస్వామి, నందిపాటి రాజు, తాళ్లపల్లి చంద్రశేఖర్, ఈదునూరి రమేష్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

26న సంయుక్త కిసాన్ మోర్చా నిరసన

పాతమంచిర్యాల: ఈ నెల 26న జిల్లా కేంద్రం మంచిర్యాలలో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏ.లాల్‌కుమార్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో జాతీయ కార్మిక సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, సీపీఐ పట్టణ కార్యదర్శి ఖలిందర్ అలీఖాన్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి మేకల రామన్న, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్, నాయకుడు చంద్రయ్య, ఏఐకేఎంఎస్ నాయకులు తిరుపతి, గణేష్ పాల్గొన్నారు.

మాల సంఘాల జేఏసీ జిల్లా కన్వీనర్ నియామకం

పాతమంచిర్యాల: మాల సంఘం, మాల ఉద్యోగుల సంఘం జేఏసీ జిల్లా కన్వీనర్‌గా పట్టణానికి చెందిన తొగరు సుధాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్ తెలిపారు. 20 మందిని జిల్లా కో కన్వీనర్లుగా నియామకం చేశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలలందరినీ ఐక్యం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. డిసెంబర్ ఒకటిన జరిగే మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారం కోసమే 'మార్నింగ్ వాక్'

- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే మార్నింగ్ వాక్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. చెన్నూర్ మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో గురువారం ఆయన మార్నింగ్ వాక్ నిర్వహించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం తన చుట్టూ తిరగొద్దనే ఉద్దేశంతో తాను ప్రజల వద్దకు వస్తున్నానని తెలిపారు. అనంతరం పట్టణంలోని పుష్పాల హనుమాన్ మందిర్ వీధిలో రూ.1.99కోట్ల నిధులతో రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

కోటపల్లి: చెన్నూర్ నుంచి వెంచపల్లి వరకు బస్సు సౌకర్యం కల్పించాలని మాజీ సర్పంచ్‌లు లక్ష్మణ్‌గౌడ్, సంతోష్, మాజీ ఎంపీటీసీ జేక శేఖర్ గురువారం ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. ఎదులబంధం, లింగన్నపేట గ్రామాల మధ్య వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. అటవీశాఖ అనుమతులు తీసుకొని రోడ్డు నిర్మిస్తే బస్సు సౌకర్యం కల్పించవచ్చని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. రోడ్డుకు మరమ్మతు చేయించి వెంటనే బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు మాజీ సర్పంచ్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాగామ శ్రీశైలం పాల్గొన్నారు.

మంచం పట్టిన మామిడిగూడెం



మామిడిగూడెంలో జ్వరంతో లక్ష్మణ్



రోడ్డుపై మురికి నీరు

- జ్వరాలతో ఇబ్బందులు
- కానరాని పారిశుద్ధ్య చర్యలు

కాసిపేట: మండలంలోని మామిడిగూడెం గ్రామం జ్వరాలతో మంచంపట్టింది. గ్రామంలో 115 కుటుంబాలు ఉండగా 10కుటుంబాలకు పైగా జ్వరాలతో బాధపడుతున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఇటువైపు చూసిన దాఖలాలు లేవు. గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడంతో జ్వరాలు ప్రబలుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. గత పది రోజులుగా జ్వరంతో బాధపడుతున్నామని, కుటుంబంలో ఒక్కరికి జ్వరం వస్తే అందరికీ వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో మంచిర్యాల ప్రైవేట్ ఆస్పత్రులు, మందమర్రి ఆర్ఎంపీల వద్ద చికిత్స పొందుతున్నారు. కాగా, గ్రామంలో 15రోజులకు పైగా చెత్త తొలగించడం లేదు. మురికి కాలువలు నిండి రోడ్లపై నీరు ప్రవహిస్తోంది. అధికారులు స్పందించి వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్లు ధ్వంసం..!



దండేపల్లి నుంచి కేజీబీవీకి వెళ్లే రోడ్డు గుంతల మయం

దండేపల్లి: మండల కేంద్రం నుంచి కేజీబీవీ పాఠశాలకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో రోడ్డు గుండా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మండల కేంద్రంలోని నేతకానివాడ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లేందుకు కొన్నేళ్ల క్రితం నిర్మించిన సీసీ రోడ్లు పగుళ్లు తేలి పూర్తిగా శిథిలం అయ్యాయి. రోడ్లపై నడిచేందుకు అవస్థలు పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి రోడ్లు మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఖాతా ఉంటేనే బీమా..!

- ఒప్పంద బ్యాంకుల్లో ఖాతాలు లేని ఉద్యోగులు 341 మంది
- కాంట్రాక్టు ఉద్యోగుల్లో 1400 మంది

శ్రీరాంపూర్: సింగరేణిలో శాశ్వత, కాంట్రాక్టు ఉద్యోగులు కంపెనీ కల్పించిన ప్రమాద బీమా సౌకర్యానికి ఇంకా కొందరు దూరంగానే ఉన్నారు. చిన్నచిన్న కారణాలతో పెద్ద ప్రయోజనానికి దూరం అవుతున్నారు. ఉద్యోగులకు మేలు చేసే ఉద్దేశంతో కంపెనీ బ్యాంకులతో ప్రమాద బీమా ఒప్పందం చేసుకుంది. ఈ బీమా అమలు కావాలంటే ఉద్యోగులంతా కంపెనీ పేర్కొన్న బ్యాంకుల్లో వేతన ఖాతాలు కలిగి ఉండాలి. వీటిపై కొన్ని నెలలుగా అధికారులు విస్తృత అవగాహన కల్పిస్తున్నా కొందరు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. సింగరేణిలో దురదృష్టావశాత్తు ఏదైనా ప్రమాదంలో కార్మికులు మృతిచెందితే నష్ట పరిహారం కోసం ధర్నాలు, మృతదేహాలతో బైఠాయింపులు జరిగేవి. ప్రైవేటు కంపెనీలతో పోల్చి చూస్తే మృతుల కుటుంబాలకు కంపెనీలో తక్కువ నష్టపరిహారాలు రావడమే అందుకు కారణం. దీంతో యాజమాన్యం కొన్ని నెలల క్రితం కొన్ని బ్యాంకులతో ప్రమాద బీమాపై ఒప్పందం చేసుకుంది. శాశ్వత ఉద్యోగులు ఎస్‌బీఐ, యూబీఐ, కెనరా బ్యాంకుల్లో, కాంట్రాక్టు ఉద్యోగులు హెచ్‌డీఎఫ్‌సీలో వేతన ఖాతాలు కలిగి ఉండాలి. శాశ్వత ఉద్యోగులు ప్రమాదాల్లో మరణిస్తే రూ.కోటి, కాంట్రాక్టు ఉద్యోగులకు రూ.32లక్షలు పరిహారం అందుతుంది. సదరు ఉద్యోగులు క్రెడిట్, డెబిట్ కార్డులు కలిగి ఉండి నిర్ణీత సమయంలో వాడి ఉన్నట్లు రికార్డు ఉంటే మరింత బీమా మొత్తం వస్తుంది.

అవగాహన కల్పించిన అధికారులు.

బీమా సౌకర్యంపై కొన్ని నెలల క్రితమే కంపెనీ, బ్యాంకు అధికారులు గనులపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. శ్రీరాంపూర్ ఏరియాలో 8,746 ఉంటే వీరిలో 8405 వేతన ఖాతాలు కలిగి ఉన్నారు. మిగతా 341 మంది ఖాతాలు తెరవలేదు. ఏరియాలో 2,500 మంది కాంట్రాక్ట్ కార్మికులు ఉండగా 1,100 మంది మాత్రమే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఖాతాలు కలిగి ఉన్నారు. ఇంకా 1400 మంది ఖాతాలు తీసుకోవాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ జాప్యం సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే పెద్ద మొత్తం బీమా డబ్బులు కోల్పోవాల్సి వస్తుంది. కాగా, 39 మంది వరకు ఉద్యోగులు విధులు సరిగ్గా నిర్వర్తించకుండా, గనుల ముఖం చూడని వారు ఖాతాలు తెరవలేదని తెలిసింది.



శ్రీరాంపూర్ ఏరియా ముఖ ద్వారం

రుణాల సమస్య..

రుణాల సమస్య కారణంగా బ్యాంకుల్లో వేతన ఖాతాలు తీసుకోవడం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న ఖాతాల్లో కొందరు ఇళ్లు, ఇతర రుణాలు తీసుకున్నారు. కిస్తీలు పూర్తి కాకపోవడంతో బీమా సౌకర్యం ఉన్న బ్యాంకుల్లోకి మారడం ఇబ్బందిగా మారింది. బీమా సౌకర్యం ఉన్న బ్యాంకుల్లో ముందుగా ఖాతాలు తెరిచి రుణాలు బదిలీ చేయడానికి బ్యాంక్, కంపెనీ అధికారులు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

> **కాంట్రాక్టర్ల జాప్యమేనా..?**
>
> కాంట్రాక్ట్ ఉద్యోగులకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుల్లో వేతన ఖాతాలు లేకపోవడానికి కాంట్రాక్టర్ల జాప్యమనే కారణమని విమర్శలు వస్తున్నాయి. కాంట్రాక్టర్ తన ఖాతాను హెచ్‌డీఎఫ్‌సీలో తెరిచి తన వద్ద పని చేసే కాంట్రాక్ట్ ఉద్యోగుల ఖాతాలను అందులో తెరిపించాల్సి ఉండగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎస్‌టీపీపీ వంటి కొన్ని వాటిల్లో పని చేసే కాంట్రాక్ట్ ఉద్యోగులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు కావడంతో తమ స్వంత రాష్ట్రాల్లోని బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నాయి. అక్కడున్న ఇంటి వారి అవసరాల కోసం బ్యాంకు లావాదేవీల కోసం ఆ బ్యాంకుల నుంచి వేతన ఖాతాలు మార్చుకోవడానికి సుముఖత వ్యక్తం చేయడం లేదు. ప్రమాదం జరిగితే బీమా రాకుండా పోతుందని అధికారులు పేర్కొంటున్నారు. మరోవైపు ఇప్పటికీ ఆ బ్యాంకుల్లో ఖాతాలు ఎందుకు తీసుకోలేదో చెప్పాలని సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు.

> **కుటుంబానికి ధీమా**
>
> ప్రమాద బీమా ఉంటేనే ప్రతీ కుటుంబానికి ధీమా ఉంటుంది. దీనిపై పలుమార్లు ఉద్యోగులకు అవగాహన కల్పించాం. మెజారిటీ ఉద్యోగులు బీమా పరిధిలోకి వచ్చారు. మిగతా వారు కూడా సత్వరమే సంబంధిత బ్యాంకుల్లో వేతన ఖాతాలు తీసుకుని బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
>
> – అరవిందరావు, డీజీఎం(పర్సనల్), శ్రీరాంపూర్

కారుతో ఢీకొట్టి.. తొక్కించి హత్య

- మామాఅల్లుళ్ల అరెస్టు
- వివాహేతర సంబంధమే కారణం..!
- వివరాలు వెల్లడించిన జైపూర్ ఏసీపీ



వివరాలు వెల్లడిస్తున్న జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్

భీమారం: వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని కారుతో ఢీకొట్టారు. ఎగిరిపడ్డ అతడిని కారుతో తొక్కించారు. ప్రాణాలు పోయాయని భావించి అక్కడి నుంచి పారిపోయారు. పథకం ప్రకారం ఓ వ్యక్తిని హత్య చేసిన మామాఅల్లుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం సాయంత్రం జైపూర్ ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ వెంకటేశ్వర్ వివరాలు వెల్లడించారు. జైపూర్ మండలంలోని రసూల్‌పల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ ఆకుదారి మల్లేశ్ తన భార్యతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడని అదే గ్రామానికి చెందిన తోట సాయికుమార్ అనుమానం పెంచుకున్నాడు. ఇదే విషయంలో సాయికుమార్ గతంలోనూ అతడిపై దాడికి యత్నించగా.. పోలీసులు కాపాడారు. ఆ తర్వాత ప్రాణభయంతో మల్లేశ్ రసూల్‌పల్లి గ్రామాన్ని వదిలి భీమారం మండల కేంద్రంలో అద్దె ఇంట్లో ఉంటూ పోలంపల్లిలోని ప్రైవేటు పాఠశాల బస్సుకు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో సాయికుమార్ తన మామ గట్టు సదయ్యతో కలిసి మల్లేశ్ హత్యకు పథకం రూపొందించాడు. భీమారంలో ఉంటున్న మల్లేశ్ కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్న నిందితులు సాయికుమార్, సదయ్యలు అతడిని హత్య చేసేందుకు కారు కొనుగోలు చేశారు. బుధవారం కారులో భీమారం వెళ్లారు. మల్లేశ్ కోసం కాపు కాసి ఉండి మంచిర్యాల వైపు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా కారులో వెంబడించారు. భీమారం మండల కేంద్రంలోని ఇప్పలబొగుడ వద్ద మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న మల్లేశ్‌ను వెనుక నుంచి వేగంగా ఢీకొట్టారని, ఎగిరి కింద పడ్డ అతడిపై కారు ఎక్కించి తొక్కించారని ఏసీపీ తెలిపారు. ప్రాణాలు పోయాయని భావించిన నిందితులు పారిపోయారు. తీవ్రంగా గాయపడిన మల్లేశ్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. నిందితులను గురువారం రసూల్‌పల్లి క్రాస్ రోడ్డు వద్ద అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. మల్లేశ్‌ను హత్య చేసిన సాయికుమార్, అతడి మామ సదయ్యపై కేసులు నమోదు చేసినట్లు ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో శ్రీరాంపూర్ సీఐ డి.వేణుచందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ గ్రామం 61వ జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని నందన్ గ్రామానికి చెందిన కూన స్వామి తన పనులు ముగించుకుని టీవీఎస్ ఎక్సెల్‌పై ఇంటికి వెళ్తుండగా నిర్మల్ నుంచి భైంసా వెళ్తున్న కదం దీపక్ ద్విచక్ర వాహనంపై వచ్చి వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో దీపక్‌కు తీవ్రంగా స్వామికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు దీపక్‌ను నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి, స్వామిని నర్సాపూర్ (జి) ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి ..

భీమారం(చెన్నూర్): మండల కేంద్రంలోని ఆరెపల్లి క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గోదావరిఖనికి చెందిన జక్కుల ఐలయ్య, గాదె పోశం గొర్రెలు కొనుగోలు చేసేందుకు ద్విచక్ర వాహనంపై చెన్నూర్ వెళ్తుండగా అడ్డువచ్చిన కుక్కలను తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. దీంతో ఐలయ్యకు తీవ్రంగా పోశంకు స్వల్ప గాయాలయ్యాయి. 108కు సమాచారం అందించడంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు.

కలప స్మగ్లర్ బైండోవర్

భీమారం(చెన్నూర్): మండలంలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన కలప స్మగ్లర్ సపోట తులసీరాంను గురువారం తహసీల్దార్ సదానందం ఎదుట బైండోవర్ చేసినట్లు మంచిర్యాల అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ రత్నాకర్ రావు తెలిపారు. తులసీరాం పలుమార్లు కలప రవాణా చేస్తూ పట్టుబడ్డాడని, మరోసారి కలప రవాణా చేయకుండా చర్యలు చేపట్టినట్లు రేంజ్ ఆఫీసర్ తెలిపారు. కాగా వచ్చే ఆరునెలల కాలంలో మళ్లీ నేరం చేస్తే రూ.5 లక్షల జరిమానా చెల్లించాలని తహసీల్దార్ ఆదేశించారని, ఈమేరకు పూచికత్తుపై విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

ముగ్గురి రిమాండ్

మందమర్రిరూరల్: మందమర్రి మండలం సారంగపల్లి గ్రామ పంచాయతీ శివారులోని దుబ్బపల్లి అటవీ ప్రాంతంలో ఈనెల 16న వన్యప్రాణుల వేటకోసం అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి రెండు గేదెల మృతికి కారకులైన ముగ్గురికి గురువారం జిల్లా కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్లు డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సంతోష్ తెలిపారు. సండ్రోన్‌పల్లికి చెందిన గోస్కుల సతీష్, గోస్కుల రాజు, దైనేని లచ్చులును ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకున్నారు. ఇదిలా ఉండగా సారంగపల్లికి చెందిన మరో ఇద్దరు కూడా ఈ కేసులో ఉన్నట్లు సమాచారం.

మహిళ అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని గడియార్ మహోళకు చెందిన సంగెంవార్ శోభబాయి (29)బుధవారం అదృశ్యమైందని టూ టౌన్ హెడ్‌కానిస్టేబుల్ మదన్ తెలిపారు. ఇంటి వద్ద గొడవ జరుగడంతో పట్టణంలోని ఇంద్రానగర్‌లో నివాసముంటున్న తన మేనమామ వద్దకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన ఆమె అక్కడికి వెళ్లలేదు. దీంతో మహిళ తమ్ముడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.



ఐజీకి గౌరవ వందనం చేస్తున్న శిక్షణ పూర్తి చేసిన కానిస్టేబుళ్లు



కార్యక్రమానికి హాజరైన పోలీసు కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు

విధుల్లో క్రమశిక్షణ ముఖ్యం

- తెలంగాణ రాష్ట్ర ఐజీ ఎం.రమేశ్
- ఘనంగా దీక్షాంత్ పరేడ్
- శిక్షణ పూర్తి చేసుకున్న 254 మంది కానిస్టేబుళ్లు

ఆదిలాబాద్‌టౌన్: పోలీసు విధుల్లో క్రమశిక్షణ ముఖ్యమని, చట్టాన్ని ఉల్లంఘించకుండా రాజ్యాంగ ధర్మాన్ని పాటిస్తూ విధులు నిర్వర్తించాలని తెలంగాణ రాష్ట్ర పీఅండ్‌ఎల్ ఐజీ ఎం.రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు శిక్షణ కేంద్రంలో తొమ్మిది నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న 254 మంది నూతన కానిస్టేబుళ్లకు గురువారం 'దీక్షాంత్ పరేడ్' నిర్వహించారు. కార్యక్రమానికి ఐజీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ సాధించిన ఐదుగురికి కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం, 2వ బెటాలియన్ కమాండెంట్ నితిక పంత్‌లతో కలిసి ఇండోర్, అవుట్‌డోర్, బెస్ట్ ఆల్‌రౌండర్, పరేడ్ కమాండర్ విభాగాల్లో బహుమతులు అందజేశారు. శిక్షణ అందించిన 50 మంది పోలీసు, వైద్య సిబ్బంది, న్యాయాధికారులకు ప్రశంసపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీతి నిజాయతీతో విధులు చేపట్టాలని సూచించారు. పోలీసు సేవలో ప్రతిఒక్కరూ అంతర్భాగమేనని, వ్యవస్థలో విజయం సాధించాలంటే కుటుంబ సభ్యుల సహకారం ఎంతో అవసరమన్నారు. కఠోర శ్రమతో శిక్షణ పూర్తి చేసుకున్న 254 స్టైఫండరి ట్రెయినీ సివిల్ కానిస్టేబుళ్లలో రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి 35 మంది, సూర్యాపేట నుంచి 129, జగిత్యాల నుంచి 34, ములుగు నుంచి 16, సంగారెడ్డి నుంచి 15, సైబరాబాద్ నుంచి 25 మంది ఉన్నారన్నారు. శిక్షణలో వినాయక నవరాత్రులు, జైనూర్ సంఘటన, దేవీ నవరాత్రి ఉత్సవాల బందోబస్తు నిర్వహించి అనుభవం సాధించారన్నారు. త్రివర్ణ పతాక సాక్షిగా చేసిన ప్రమాణాన్ని, మీ జిల్లాల్లో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో గుర్తు చేసుకోవాలన్నారు. అధికారులు నిర్దేశించిన విధులు నిష్పక్షపాతంగా, ఎలాంటి రాగద్వేషాలు లేకుండా సమన్యాయంతో నిర్వర్తించాలని సూచించారు. అవినీతి ఆరోపణలు లేకుండా ప్రలోభాలకు గురికాకుండా నిజాయతీతో విధులు నిర్వర్తించాలని సూచించా కానిస్టేబుళ్లకు శిక్షణలో భాగంగా పోలీసు పరిపాలన డాక్యుమెంటేషన్, వ్యక్తిత్వ వికాసం, శాంతిభద్రతలు, ఇంటెలిజెన్స్, అంతర్గత భద్రత, క్రిమినల్ చట్టం బీఎంఎస్, బీఎస్ఎస్ఎస్, ఫోర్ఇన్‌సిక్స్ సైన్స్, ఫోరెన్సిక్ మెడిసిన్, అవుట్‌డోర్ విభాగాల్లో ఫిజికల్ ట్రైనింగ్, స్క్వాడ్రిల్, ఆమ్స్ డ్రిల్, లాటిడ్రిల్, టియర్ గ్యాస్, మాబ్ ఆపరేషన్, వెపన్ ట్రైనింగ్ ఫీల్డ్ క్రాఫ్ట్, ట్రాఫిక్ డ్రిల్, ఫస్ట్‌ఎయిడ్ లాంటి వాటిలో శిక్షణను అందించినట్లు శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ అదనపు ఎస్పీ సి.సమయ్ జాన్‌రావు తెలిపారు. అంతకుముందు ఐజీ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఐఏఎస్ అభిజ్ఞాన్, అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేందర్‌రావు, డీఎస్పీలు ఎల్.జీవన్ రెడ్డి, బి.సురేందర్‌రెడ్డి, ప్రకాష్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసు కానిస్టేబుళ్లతో ఐజీ రమేశ్, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం

మొదటి శిక్షణ జిల్లాలోనే : ఐజీ రమేశ్

హైదరాబాద్‌లో తొమ్మిది నెలల పాటు డీఎస్పీగా శిక్షణ పొందిన తర్వాత ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో నెల రోజుల పాటు పోలీస్ కానిస్టేబుల్‌కు సంబంధించి వన్‌టౌన్‌లో పనిచేసిన కానిస్టేబుల్ బాబర్ వద్ద శిక్షణ తీసుకున్నట్లు చెప్పారు. సెంట్రిడ్యూటీ, దర్యాప్తు నేర్చుకున్నట్లు తెలిపారు. ఆ సమయంలో ఎస్‌హెచ్ఓగా సురేందర్ రెడ్డి ఉన్నారని పేర్కొన్నారు. తాను ఆ సమయంలో నేర్చుకున్న శిక్షణ ఎంతగానో ఉపయోగపడిందన్నారు. ఈ సందర్భంగా జిల్లాతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. తనకు శిక్షణ ఇచ్చిన కానిస్టేబుల్, ఆ సమయంలో పనిచేసిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను గుర్తు చేసుకున్నారు.



కానిస్టేబుళ్ల ఫొటోలు తీసుకుంటున్న కుటుంబసభ్యులు

ఆనందక్షణం... అద్వితీయం

తెలంగాణలోని ఆరు జిల్లాలకు చెందిన పోలీసు కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అట్టహాసంగా జరిగింది. అవుట్ పరేడ్‌ను తిలకించేందుకు తమ కుటుంబసభ్యులు హాజరు కాగా కొంతమంది కానిస్టేబుళ్లు వారితో తమ జ్ఞాపకాన్ని పదిలపర్చుకున్నారు. ఆ మధుర క్షణాలను సెల్‌ఫోన్‌లో బంధించారు. డీటీసీలో కన్పించిన ఈ దృశ్యాలు ఆకట్టుకున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



కూతురుకు పోలీసు క్యాపు ధరిస్తూ..



తల్లిదండ్రులకు సెల్యూట్ చేస్తున్న కుమారుడు

వ్యాను ఢీకొని వృద్ధుడు మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్): ఐచర్ వ్యాను ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం కైరిగాం గ్రామానికి చెందిన ఎర్ర లచ్చయ్య (68) బుధవారం రాత్రి జాతీయ రహదారి అవతలి వైపు ఉన్న కిరాణా దుకాణానికి వెళ్లి ఇంటికి వచ్చేందుకు రోడ్డు దాటుతుండగా ఆసిఫాబాద్ వైపు నుంచి వస్తున్న ఐచర్ వ్యాను అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో వృద్ధునికి తీవ్రగాయాలు కావడంతో గమనించని స్థానికులు చికిత్స నిమిత్తం ఆసిఫాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు వ్యాన్ డ్రైవర్ మల్లేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



మృతదేహానికి పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై

ఆయుధాలతో నలుగురి పట్టివేత..?

- ఆదిలాబాద్–మహారాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద..!
- ఉత్తరప్రదేశ్‌కు చెందిన సాధువులు అనే ప్రచారం
- నల్గొండ పోలీసుల అదుపులో..
- నేరుగా వారిని హైదరాబాద్‌కు తరలించారనే వినికిడి
- వివరాల వెల్లడిలో పోలీసుల గోప్యత

సాక్షి,ఆదిలాబాద్: షార్ప్ వెపన్స్ కలిగి ఉన్న నలుగురు వ్యక్తులను తెలంగాణ పోలీసులు ఆదిలాబాద్–మహారాష్ట్ర సరిహద్దులో భోరజ్ చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. వారు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సాధువులు అనే ప్రచారం జరుగుతోంది. నల్గొండ నుంచి వచ్చిన పోలీసులు ఆదిలాబాద్ జిల్లా పోలీసుల సహకారంతో వారిని అదుపులోకి తీసుకొని నేరుగా హైదరాబాద్‌కు తరలించినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో పోలీసులు గోప్యత పాటిస్తున్నారు. ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, డీఎస్పీ జీవన్‌రెడ్డిని ఈ విషయంలో సంప్రదించేందుకు 'సాక్షి' ఫోన్‌లో యత్నించగా వారు అందుబాటులోకి రాలేదు. ఆ నలుగురు పేర్లు, వివరాలు పూర్తిస్థాయిలో తెలియరాలేదు. నల్గొండ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు గురువారం ఆదిలాబాద్‌కు వారు నేరుగా చేరుకున్నట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్ మండలంలో జాతీయ రహదారి 44 పైనే భోరజ్ చెక్‌పోస్టు ఉంటుంది. ఆ నలుగురు ఆయుధాలతో ఉండగా, వారిని పట్టుకొని జిల్లా పోలీసుల సహకారంతో రాష్ట్ర రాజధానికి తరలించారని జరుగుతున్న ప్రచారం సంచలనం కలిగిస్తోంది. ఇదిలా ఉంటే మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత ఈ సంఘటన సరిహద్దులో చోటు చేసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆ నలుగురు ఎటు నుంచి ఎటువైపు వెళ్తున్నారు? వారు ఎందుకోసం ఈ మార్గం గుండా బయల్దేరారు? వారి లక్ష్యం ఏమిటనే విషయాలు తెలియరాలేదు. అయితే ఆయుధాలు కలిగి ఉన్నారనడం మాత్రం ప్రకంపనలు సృష్టిస్తోంది.

హ్యుందాయ్ షోరూం ప్రారంభం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణ సమీపంలో గురువారం ప్రకాష్ హ్యుందాయ్ నూతన షోరూమ్‌ను రీజినల్ మేనేజర్ రాంకుమార్, షోరూమ్ ఎండీ నల్ల దినేష్‌రెడ్డి, సీఈవో ప్రతిహాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు సేల్స్, సర్వీస్, స్పేర్‌లో అత్యాధునిక సదుపాయాలతో షోరూమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌వో మేనేజర్ రోహిత్ కుమార్, టీఎస్ఎం స్నేహమై, సర్వీస్ టీఎస్ఎం ప్రకాష్, షోరూమ్ మేనేజర్ ఉమాకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ప్రకాష్ హ్యుందాయ్ షోరూం ప్రారంభిస్తున్న రీజినల్ మేనేజర్ రాంకుమార్

ఆటో బోల్తాపడి మహిళ మృతి

ఆదిలాబాద్‌రూరల్: ఆటో బోల్తాపడి మహిళ మృతి చెందిన సంఘటన ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మున్నిబీ (53), భర్త ఫారుఖ్ అహ్మద్ పాత బట్టలను విక్రయించే వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గురువారం ఆటోలో పాత బట్టలను నింపుకొని ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రకు వెళ్తుండగా చాందా గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై బోల్తా పడింది. ఈ ఘటనలో మున్నిబీ అక్కడికక్కడే మృతి చెందగా ఫారుఖ్ అహ్మద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఓవర్ లోడ్, అతివేగం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'స్ఫూర్తి'ని చాటి... ఉద్యోగం సాధించి

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రంలోని దత్తాత్రేయ నగర్ కాలనీకి చెందిన యెర్ర వనజ–పాండురంగారెడ్డి దంపతుల కుమార్తె స్ఫూర్తి గురువారం సాయంత్రం విడుదలైన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో ప్రతిభను కనబర్చి ఉద్యోగం సాధించింది. పదోతరగతి వరకు స్థానికంగా ఉన్న గౌతం మోడల్ స్కూల్, ఇంటర్ అభ్యాస జూనియర్ కళాశాలలో, డిగ్రీ హైదరాబాద్‌లోని కోఠి ఉమెన్స్ కాలేజీలో, పీజీ ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో చదివింది.ఈ క్రమంలోనే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నుండి జూనియర్ లెక్చరర్స్ నోటిఫికేషన్ విడుదల కాగా పట్టుదలతో చదివి రాష్ట్రస్థాయిలో 56వ ర్యాంకు, మల్టీజోన్ స్థాయిలో 30వ స్థానాన్ని సాధించి జూనియర్ లెక్చరర్ ఉద్యోగం సొంతం చేసుకుంది.



యెర్ర స్ఫూర్తి

రేపు ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శుక్రవారం జరగనున్న ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–17 బాలుర క్రికెట్ ఎంపిక పోటీలను 23న నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ సెక్రెటరీ కాంతారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్న దృష్ట్యా ఎంపిక పోటీలను 23కు వాయిదా వేయడం జరిగిందని, ఈ విషయాన్ని క్రీడాకారులు, శిక్షకులు గమనించాలని ఆయన కోరారు.

ఏఐటీయూసీలో పలువురి చేరిక

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్‌లో విధులు నిర్వహిస్తున్న ఐఎన్టీయూసీ నాయకుడు సీవీ రమణతో పాటు మరి కొందరు గురువారం ఏఐటీయూసీలో చేరారు. జీఎం ఆఫీస్ ఆవరణలో యూనియన్ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, అధ్యక్షుడు సీతారామయ్య హాజరయ్యారు. వారి సమక్షంలో సీవీ రమణతో పాటు మరికొంతమంది యూనియన్‌లో చేరారు. సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సుదర్శన్, మల్లేశ్, శ్రీనివాస్, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

'మామిడి'లో యాజమాన్య పద్ధతులు

- పూతదశలో ఆశిస్తున్న చీడపీడలు
- నివారణకు సస్యరక్షణ చర్యలు

బెల్లంపల్లి: మామిడిచెట్లకు పూత ఏపుగా రావడానికి యాజమాన్య పద్ధతులు పాటించాల్సిన సమయం ఆసన్నమైంది. పూత రావడానికి వాతావరణ పరిస్థితులు ఎంతగానో ప్రభావం చూపుతాయి. చెట్లకు పూత పూయించడానికి, వచ్చిన పూత ఆగడానికి, కాపు సరిగా రావడానికి, పూత దశలో ఆశించే చీడపీడల నివారణకు యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా పూత సరిగా రాక, అరకొరగా వచ్చిన పూత నిలువక దిగుబడి తగ్గుతుందని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్, శాస్త్రవేత్త కోట శివకృష్ణ పేర్కొంటున్నారు. ఈక్రమంలో మామిడి రైతులు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, పాటించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు.



కోట శివకృష్ణ, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్

చెట్లకు పూత వచ్చే దశ

మామిడి చెట్లకు సాధారణంగా జూలై, ఆగస్టు మాసాల్లో ఇగుర్లు వచ్చి ముదురుతాయి. ఇగుర్ల రెమ్మల్లో నుంచి పూత వస్తుంది. ఆ ప్రక్రియ డిసెంబర్ చివరి వారం నుంచి జనవరి వరకు జరుగుతుంది. డిసెంబర్‌లో సగటు ఉష్ణోగ్రత 18 నుంచి 28 డిగ్రీల సెంటిగ్రేడ్, రాత్రి ఉష్ణోగ్రత 10 నుంచి 13 డిగ్రీల సెంటి గ్రేడ్ వరకు ఉంటే చెట్లకు పూత ఏపుగా వస్తుంది. ఒకవేళ వాతావరణ పరిస్థితుల్లో తేడా ఏర్పడితే పూతలో మార్పులు ఉంటాయి. అందుచేత పూత రావడానికి రెండు నెలలు తోటలకు నీటి తడులు ఇవ్వడం పూర్తిగా నిలిపి వేయాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

నవంబర్ నుంచి జనవరి వరకు కొమ్మ కత్తిరింపులు, దున్నడం లాంటివి చేయకుండా మామిడి చెట్లకు విశ్రాంతి ఇవ్వాలి. ఆ సమయంలో చెట్టుకు అంతరాయం కలిగిస్తే పూత రావడం ఆలస్యం కావడం లేదా పూత రాకుండా ఉండడమే కాకుండా దిగుబడులు తగ్గే అవకాశం ఉంటుంది. సాధారణంగా మామిడి చెట్లకు డిసెంబర్, జనవరిలో పూత ప్రారంభమై ఫిబ్రవరి వరకు పూస్తాయి. ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పుడు పూ మొగ్గలను ఉత్తేజ పరిచేందుకు డిసెంబర్ రెండవ పక్షంలో లీటరు నీటికి 10 గ్రాముల మల్టీ–కే (పొటాషియం,నైట్రేట్), 5 గ్రాముల యూరియా కలిపి చెట్ల పైరెమ్మలు బాగా తడిచేలా పిచికారీ చేయాలి. యూరియా, మల్టీ–కేలోని నత్రజని, పొటాషియం పోషకాలు కలిసి పూ మొగ్గలను ఉత్తేజ పరుస్తాయి. దీంతో చెట్లకు పూత అధికంగా రావడానికి, పిందె కట్టడానికి, కాయలు మంచి సైజులో నాణ్యతగా ఎదగడానికి సహకరిస్తాయి.



మామిడి తోట

పూత ఏపుగా రావడానికి ..

మామిడి చెట్లకు పూత ఏపుగా రావడానికి యాజమాన్య పద్ధతులు పాటించాలి. తోటల్లో తేనెటీగ పట్టులను ఏర్పాటు చేయడం వల్ల తేనెటీగల సంచారం పెరిగి పరపరాగ సంపర్కం అధికంగా జరుగుతుంది. దీంతో పూత ఏపుగా రావడానికి వీలవుతుంది. తద్వారా పంట దిగుబడి 20 నుంచి 30 శాతం పెరిగేందుకు ఆస్కారం ఉంటుంది. తోట నలుమూలల తేనెపట్టులను ఏర్పాటు చేసుకోవడం వల్ల ఉపయుక్తంగా ఉంటుంది.

ఆకుమచ్చ, నల్లమచ్చ తెగుళ్ల ప్రభావం

ఆకుమచ్చ, పూతమాడు, నల్లమచ్చ తెగుళ్లు పూత సమయంలో ఆశిస్తాయి. వర్షాలు, పొగమంచు అధికంగా ఉన్న సమయంలో ఈ తెగుళ్లు విజృంభిస్తాయి. లేత ఆకులు, రెమ్మలు, పూలను ఆశించి నష్టపరుస్తాయి. ఆకుల మీద గోధుమ రంగులో మచ్చలు ఏర్పడి ఆకులు త్వరగా పండుబారి రాలి పోతాయి. రెమ్మల పైన నల్లని మచ్చలు ఏర్పడి పూలగుత్తులు , పూలు మాడిపోతాయి. ఈ తెగులు నివారణ కోసం పూత దశకు ముందే ఎండిన కొమ్మలను కత్తిరించి తగుల బెట్టాలి. లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1 శాతం బోర్డో మిశ్రమం కలిపి పిచికారీ చేయాలి.

చీడపీడల నివారణకు యాజమాన్య పద్ధతులు

సాధారణంగా మామిడి చెట్లను పూత దశలో బూడిద రంగు తెగులు ఆశిస్తుంది. లేత ఆకులు, పూత కాండం, పూలమీద, చిరుపిందెల మీద, తెల్లని ఫౌడర్ లాంటి బూజు చేరుతుంది. దీనినే బూడిద తెగులు అంటారు. ఇది ఎక్కువగా రాత్రి పూట చల్లగా, పగలు వేడి ఎక్కువగా ఉన్నప్పుడు ఆశిస్తుంది. ఈ తెగులు వల్ల చెట్లకు వచ్చిన పూత, కాత రాలి పోతుంది. దీని నివారణకు పూత దశలో తెగులు కనిపించగానే హెక్సాకోనజోల్ 2.మి.లీ లేదా ప్రొపికోనజోల్ 1 మి.లీ లేదా డినోకాఫ్ లేదా ట్రిడిమాల్స్ 1 మి.లీ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పట్టపగలే చోరీ

పెంబి: మండల కేంద్రానికి చెందిన పాకల రాజవ్వ రోజులాగే గురువారం ఉదయం పొలం పనులకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. అందులో ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

జేసీబీని ఢీకొట్టిన కారు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్కే 6 గాంధీనగర్ జాతీయ రహదారిపై గురువారం జేసీబీని కారు ఢీకొట్టింది. గోదావరిఖని ప్రాంతానికి చెందిన పలువురు కారులో బెల్లంపల్లికి వెళ్లి శ్రీరాంపూర్ వైపు వస్తుండగా ముందున్న జేసీబీని ఢీకొట్టారు. ప్రమాదంలో కారు ముందుభాగం ధ్వంసమైంది. కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి.

ట్రాక్టర్‌పై వెళ్లి.. వైద్యం అందించి



ట్రాక్టర్‌పై వెళ్తున్న వైద్య సిబ్బంది



చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హీరాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మారుమూల గ్రామమైన శాంతాపూర్‌కు సరైన రహదారి లేక అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితి. గ్రామంలో 27 ఆదివాసీ కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. దంతన్‌పల్లి పీహెచ్‌సీ వైద్యురాలు అనురాధ గురువారం సిబ్బందితో కలిసి ట్రాక్టర్‌పై గ్రామానికి వెళ్లి వైద్యం అందించారు. ఈ సందర్భంగా 50 మందికి వైద్యచికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు. 10 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఈవా ఫౌండేషన్ సభ్యులు కొమ్ము విజయ్ గ్రామస్తులకు పల్లిపట్టీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఈ రాంబాయి, సూపర్‌వైజర్ నూర్‌సింగ్, ఏఎన్ఎంలు ఎల్లవ్వ, వరలక్ష్మి, స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.